సాక్షి శ్రీకాకుళం

బుధవారం ı 9 ı అక్టోబర్ ı 2024

I



నిన్నే చేరుకో'లేఖ'

నేడు తపాలా దినోత్సవం. ఏళ్లుగా సేవలు అందించిన ఉత్తరం ఇప్పుడు దాదాపు కనుమరుగైంది. - IIలో



విద్యుత్ షాక్‌తో..

విద్యుత్ షాక్‌తో కంచిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఇతను భవానీ మాల ధరించి ఉన్నాడు. - IIలో

మేలు జాతి వంగడాలు అందిస్తాం

బూర్జ: మేలు జాతి వంగడాలు ప్రజలకు అందించడమే డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం ఉద్యాన పరిశోధన స్థానం ఉద్దేశమని వెంకటరామన్నగూడెం కేంద్రం సంచాలకులు డాక్టర్ ఎం.మాధవి అన్నారు. మండలంలో గల పెద్దపేట గ్రామం ఉద్యాన పరిశోధన కేంద్రంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రెండేళ్ల కిందట ఈ పరిశోధన సంస్థను ప్రారంభించినట్లు చెప్పారు. పెద్దపేట ఉద్యాన పరిశోధన స్థానంలో ఉన్న నాణ్యమైన కొబ్బరి మొక్కలను నవంబర్ నుంచి విక్రయిస్తామన్నారు.

న్యూస్‌రీల్

ఉత్సవాలు.. ఊరే ఘటాలు



బైపల్లి గ్రామంలో కొలువుదీరిన వనదేవతలు శ్రీ చింతలపోలమ్మ, పాలపోలమ్మ,కొత్త అమ్మవార్లకు స్థానికులు మంగళవారం ఘటాలెత్తారు. ఆడపడుచులంతా ఘటాలు తీసుకుని అమ్మవారి వద్దకు వెళ్లడంతో ఊరంతా సందడిగా కనిపించింది. అనంతరం సుమారు 2 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు.
– వజ్రపుకొత్తూరు రూరల్

అండమాన్‌లో దసరా ఉత్సవాలు



అండమాన్ నికోబార్ దీవిలో దసరా ఉత్సవాలు

కాశీబుగ్గ: అండమాన్ నికోబార్ రాజధాని పోర్టు బ్లెయిర్‌లో మంగళవారం తెలుగు వారు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలాస మండలం చిన్ననీలావతి గ్రామానికి చెందిన 150 మందికిపైగా ప్రజలు స్వయంగా ఏర్పాటు చేసుకున్న శ్రీకాళీమాత మందిరం వద్ద పూజలు చేశారు.

బొమ్మల కొలువు

సంప్రదాయాలకు నెలవు

మన పూర్వీకుల ఆచార వ్యవహారాలు ఎలా ఉండేవో..?
ఓ సారి బొమ్మల కొలువు పరిశీలనగా చూస్తే సరి.
మన తాతముత్తాతల కథాకాలక్షేపాలు ఎలా సాగేవో..?
బొమ్మల కొలువుల్లో దాగి ఉన్న కథలు తెలుసుకుంటే చాలదా..
ఆనాటి వివాహ పద్ధతుల సంగతేంటో..?
ఆ కొలువులోని పెళ్లి బొమ్మలు చూడరాదూ..
బొమ్మల కొలువు కేవలం సరదా కాదు.. ఆ కొలువు మన సంప్రదాయాలకు నెలవు. వందల ఏళ్లుగా ఈ కొలువులు నిర్వహిస్తున్న వారికి ఈ విషయం బాగా తెలిసి ఉంటుంది. ముందు తరం వారు ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును జాగ్రత్తగా కాపాడుకుంటూ.. మన బొమ్మలను జత చేస్తూ.. తరం మారుతున్న కొద్దీ కొలువును మరింత అందంగా తయారు చేస్తారు. పాతకాలం నాటి బొమ్మలు ఆ నాటి కథాకాలక్షేపాలకు ఆచార వ్యవహారాలకు సాక్షిగా ఉంటాయి. ఈ నాటి బొమ్మలు మారిన పరిస్థితులు తెలియజేస్తాయి. – శ్రీకాకుళం కల్చరల్





అరసవల్లిలో బొమ్మల కొలువు

- దసరా, సంక్రాంతి వేళల్లో బొమ్మల కొలువులు
- 9 రోజుల పాటు సందడి
- వందేళ్లుగా ఇప్పిలి వారింట కొనసాగుతున్న కొలువు

దసరా ఉత్సవాల్లో ఊరూరా జరిగే సంబరాలతో పాటు ఒకప్పుడు ఇంటింటా జరిగిన బొమ్మల కొలువులదీ కూడా ఓ ప్రత్యేకత. బొమ్మల కొలువులు దసరాతో పాటుగా సంక్రాంతి సమయంలో కూడా ఏర్పాటు చేస్తారు. దసరాలో తొమ్మిది రోజుల పాటు బొమ్మల కొలువులు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి, చుట్టు పక్కల ఉన్న ముత్తైదువలను, చిన్నపిల్లలను పిలిచి తాంబూలం ఇవ్వడం ఆనవాయితీ. మారుతున్న కాలంతో పాటుగా ఇలాంటి సంప్రదాయాలు అక్కడక్కడా మాత్రమే కనపడుతున్నాయి. ఆనాటి కట్టుబాట్లను మర్చిపోకుండా కొందరు ఇంకా కొలువులు నిర్వహిస్తున్నారు.



ఇప్పిలి వారి ఇంట కొలువైన బొమ్మలు



విజయలక్ష్మి ఇంట బొమ్మల కొలువు

బొమ్మల కొలువులో నూతనత్వం



కొలువులో ఏటా కొత్త బొమ్మలను చేర్చడం జరుగుతుంది. అలాగే ఉన్న బొమ్మలను ఏ విధంగా పేర్చాలో ఆలోచన చేయడంతోపాటుగా వాటి అమరిక విధానం కూడా సంప్రదాయాన్ని దాటిపోకుండా ఉండాలి. బొమ్మల కొలువులో అన్ని రకాల బొమ్మలకు స్థానం కల్పించడంతో పాటుగా సందేశాత్మకంగా ఉండే విధంగా రూపొందించాల్సి ఉంటుంది. ఇందులో మట్టి బొమ్మలు, కొయ్యబొమ్మలు, పింగాణివి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ బొమ్మలు కనిపిస్తాయి. వీటిని అమర్చడమే కాదు పనయ్యాక ఏడాది పాటు భద్రపరచడం కూడా ఓ విశేషమే.

వందేళ్లుగా..

అరసవల్లిలోని ఆదిత్యునికి సేవ చేస్తున్న ఇప్పిలి వంశానికి చెందిన ప్రతినిధులు తమ తాతముత్తాలనుంచి ఈ బొమ్మల కొలువు సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఒకే చోట ప్రస్తుతం 12 కుటుంబాల వాళ్ల కలసి బొమ్మల కొలువును ఏర్పాటు చేస్తారు. కొన్నేళ్లగా ఇంట్లో బొమ్మల కొలువులు నిర్వహిస్తుండడంతో పాత బొమ్మలతో పాటుగా కొత్తబొమ్మలు చేర్చి ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. అందులో పెళ్లి సందడి, అష్టలక్ష్ములు, దశావతారాలు, అడవిలో క్రూరమృగాలు, పలురకాల దేవుడి బొమ్మలు, రక్తచందనం బొమ్మలు, కొయ్యబొమ్మలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి.



మండావారి ఇంట కొలువు

52 ఏళ్లుగా..

శ్రీకాకుళం కత్తెరవీధిలోని 52 ఏళ్లుగా మండావారి ఇంట్లో బొమ్మల కొలువు నిర్వహిస్తున్నారు. వీరి తాత తండ్రుల సమయంనుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తున్నామని 80ఏళ్ల మండా జగదాంబ తెలిపారు.

నా చిన్నతనం నుంచి



నా చిన్నతనం నుంచి బొమ్మల కొలువులు చూస్తున్నా. మా ఇంట్లో వాటికి రంగులు వెలసిపోతే వాటికి రంగులు వేయించాను. కొన్ని బొమ్మలు వేరేవాళ్లకి ఇచ్చి మిగిలిన బొమ్మలతో పాటుగా కొత్తవి కొని కొలువు పెడుతున్నాను. – కె.విజయలక్ష్మి, గుడివీధి, శ్రీకాకుళం

కొలువులు తగ్గాయి



దసరాలో బొమ్మల కొలువులు పెట్టడం తగ్గాయి. అక్కడక్కడ మాత్రమే పెడుతున్నారు. నా చిన్నతనంలో ప్రతి వీధిలో ఒక బొమ్మల కొలువు ఉండేది. సరదాగా నా ఫ్రెండ్స్‌తో కలసి బొమ్మల కొలువు చూసేందుకు వెళ్లేవాళ్లం.
– డీవీఎల్ సుందరి, గృహిణి, హౌసింగ్ బోర్డు కాలనీ

సంప్రదాయాల్ని భావితరాలకు అందించాలి



పెద్దలు పెట్టిన సంప్రదాయాల్ని కాపాడడమే కాకుండా తర్వాతి తరం వాళ్లకు కూడా అందించాలి. మా పెద్దలు నా పెళ్లికి ముందు బొమ్మలు కొలువు పెట్టేవారు. నేనూ ఆ సంప్రదాయాలను పాటించేందుకు కృషిచేస్తున్నా. – ఇప్పిలి ఉష, శ్రీకాకుళం

జాగ్రత్తగా భద్ర పరుస్తున్నా..



నా చిన్నతనం నుంచి బొమ్మల కొలువు పెట్టడం సరదా. బొమ్మలు విరిగి పోకుండా కాపాడుకుంటూ జాగ్రత్తలు తీసుకుంటాను. బొమ్మ సైజును బట్టి రూ.10లు వరకు ఉండేవి. వాటిని భద్రంగా ట్రంకు పెట్టెల్లో పెట్టి గుడ్డలు, కాగితాలు కప్పి రంగులు వెలసిపోకుండా ఇప్పటికీ దాస్తున్నాను.
– మండా జగదంబ, కత్తెరవీధి, శ్రీకాకుళం

అమ్మో..! పోతోంది రాబడి

తమ్ముళ్లూ కాస్త తగ్గండి!



- దరఖాస్తుల అడ్డుకట్టపై ఉలిక్కిపడిన ప్రభుత్వం
- ఆదాయానికి గండి పడుతుందని అప్రమత్తం
- ఎమ్మెల్యేలు, నాయకులకు అధిష్టానం నుంచి ఫోన్లు
- దరఖాస్తులు అడ్డుకుంటే ఆదాయాన్ని కోల్పోతామని ఆందోళన
- లాటరీలో దుకాణాలు వచ్చాక నచ్చినట్టు చేద్దామని హితబోధ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

మద్యందుకాణాల దరఖాస్తుల కట్టడిపై ప్రభుత్వం ఉలిక్కి పడింది. ఔత్సాహిక వ్యాపారులు దరఖాస్తులు చేయకుండా ఎమ్మెల్యేలు, టీడీపీ నేత లు అడ్డుకుంటున్న వైనంపై మండిపడింది. సోమ వారం సాయంత్రం వరకు మందకొడిగా దరఖాస్తులు పడటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్న విషయాన్ని గమనించి యుద్ధ ప్రాతిపదికన ఆ పార్టీ ఎమ్మెల్యేలకు, పార్టీ పదవుల్లో ఉన్న వారికి ఫోన్‌లు చేసి హెచ్చరించింది. దరఖాస్తులు అడ్డుకుంటే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పోతుందని, లాటరీలో షాపులొచ్చాక ఏదైనా చూసుకోవచ్చని, ఈలోపు అడ్డుకోవద్దని హితబోధ చేసింది. ఫలితంగా సోమవారం నాటికి 860 వరకు పడిన దరఖాస్తులు మంగళవారం సాయంత్రానికి బాగా పెరిగాయి.

తలంటిన అధిష్టానం..

మద్యం దుకాణాలకు దరఖాస్తులు వేయనివ్వకుండా జిల్లాలోని ఔత్సాహిక వ్యాపారులను అడ్డుకున్న విషయం తెలిసిందే. శ్రీకాకుళం, రణస్థలంలో తప్ప మిగతా అన్ని చోట్ల ఈ రకమైన ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాల దుకాణాలకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు పడలేదు. చాలా దుకాణాలకు సింగిల్ డిజిట్‌లోనే పడ్డాయి. అందులోనూ షాపుకి నాలుగైదు లోపే దరఖాస్తులు వచ్చిన పరిస్థితులు ఉన్నాయి. జరుగుతున్న పరిణామాలపై మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు రావడం, అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వం ఆశించిన మేర దరఖాస్తులు రాకపోవడంతో చంద్రబాబు సర్కార్ ఉలిక్కిపడింది. ఇలాగైతే, ప్రభుత్వానికి ఆదాయం సమకూరదని, దరఖాస్తులను అడ్డుకుంటే ఊరకనే వచ్చే ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తుందని హుటాహుటిన అప్రమత్తమై తమ పార్టీ నేతలకు, ఎమ్మెల్యేలకు ఫోన్‌లు చేసి గట్టిగా మాట్లాడింది. దరఖాస్తులను ఏ ఒక్కరూ అడ్డుకోవద్దని, ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల వరకు కోల్పోవాల్సి వస్తుందని ఒక్కో జిల్లాలో ఆరేడు వేల దరఖాస్తులు వస్తాయని ఆశించామని అనుకున్నట్టు దరఖాస్తులు పడితే రూ. 120 కోట్ల నుంచి రూ.140 కోట్ల వరకు దరఖాస్తుల రూపేణా ఆదాయం వస్తుందని, దానికి ఇప్పుడు గండి కొట్టవద్దని కాసింత సీరియస్‌గానే హెచ్చరించినట్టు తెలిసింది. ఏదైనా ఉంటే లాటరీ అయిపోయాక మాట్లాడుకుందామని, షాపులు దక్కించుకున్న వారితో మాట్లాడుకుని ఏదో ఒకటి చేసుకోండని అంతవరకు జోక్యం చేసుకోవద్దని చెప్పడంతో టీడీపీ నేతలు వెనక్కి తగ్గినట్టు సమాచారం. అధిష్టానం నుంచి ఫోన్‌లు వచ్చిన తర్వాత జిల్లాలో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. సోమవారం సాయంత్రానికి జిల్లాలోని 158 దుకాణాలకు గాను 860 దరఖాస్తులు పడగా, మంగళవారం రాత్రికి 2067 వచ్చాయి. ఇక, చివరి రోజైన బుధవారం మరింతగా దరఖాస్తులు పడే అవకాశం ఉంది.

ప్లాన్ బీ అమలు..

అధిష్టానం హెచ్చరికలతో నాయకులు వెనక్కి తగ్గినప్పటికీ దుకాణాలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో చేజార్చుకోకూడదన్న కసితో ఉన్నారు. దానిలో భాగంగా ప్లాన్ బీ అమలు చేస్తున్నారు. దరఖాస్తులు ఎక్కువగా పడటం వల్ల లాటరీలో ఎవరికి అదృష్టం వరించినా చివరికి ఆ దుకాణం వారి గుప్పెట్లో ఉండేలా లేదంటే వాటాలైనా దక్కించుకునేలా కాదూ కూడదంటే దక్కించుకున్న దుకాణానికి ఎంతకొంత గుడ్‌విల్‌గా ఇచ్చేసి స్వాధీనం చేసుకునేలా పావులు కదుపుతున్నారు. మద్యం దుకాణాల కోసం అనువుగా ఉండే షాపులను, భవనాలను చెప్పుచేతుల్లో పెట్టుకోవాలని తమకు తప్ప బయటకు వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని వార్నింగ్‌లివ్వండని హితబోధ చేస్తున్నారు. కానీ వారికి భవనాలను అద్దెకిస్తే ఇబ్బందులు పడతారని, ఆ అద్దె తామే కడతామని, దుకాణాల లాటరీ కొలిక్కి వచ్చేంతవరకు ఓపికగా ఉండాలని ఎవరికీ మాట ఇవ్వకూడదని దుకాణాలు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాల్లోని ఖాళీ భవన యజమానులకు పచ్చనేతలు హుకుం జారీ చేస్తున్నారు. లాటరీలో దుకాణం దక్కించుకున్న వారు సాధ్యమైనంతవరకు వదులుకునేలా చేద్దామని, గుడ్ విల్ కింద రూ.20 లక్షలో, 30లక్షలో ఇచ్చి తరిమేద్దామని, అయినప్పటికీ గట్టిగా పట్టుబడితే వాటాలివ్వాలని ఒత్తిడి చేద్దామని మద్యం దుకాణాలపై మన పెత్తనమే ఉంటుందని వాటి ఆదాయం మనకు వచ్చేలా చూస్తామని కూడా ద్వితీయశ్రేణి నాయకులకు భరోసా ఇస్తున్నారు.

అధిష్టానం చెప్పినా..

అధిష్టానం జోక్యంతో జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు పెరిగినా టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో మాత్రం పెద్దగా దరఖాస్తులు పెరగలేదు. మంగళవారంనాటికి పరిస్థితి ఇలా ఉంది.

- టెక్కలి స్టేషన్ పరిధిలో 11 దుకాణాలకు 63 దరఖాస్తులు వచ్చాయి.
- కోటబొమ్మాళి స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు 91 దరఖాస్తులు పడ్డాయి.

జిల్లా వ్యాప్తంగా చూస్తే ఇక్కడే అత్యల్పంగా దరఖాస్తులు వచ్చాయి.

- పలాస స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు గాను 87 మాత్రమే పడ్డాయి. ఆ రెండు నియోజకవర్గాలపైన కీలక నేత సోదరుడి ప్రాబల్యం ఉంది. ఆయన చెప్పినట్టుగానే జరగాలన్న ఆలోచనతో ఉన్నారు. మరి, అధిష్టానం ఆదేశాలతో బుధవారంలోగా దరఖాస్తులు పెరుగుతాయో లేదంటే తమను టచ్ చేసే స్థాయి ఎవరికీ లేదని, తమకు చెప్పేంత దమ్ము అధిష్టానంకు సైతం లేదని భీష్మించుకుని కూర్చొని ఉంటారో చూడాలి.
- అలాగే నరసన్నపేట స్టేషన్ పరిధిలో 12 దుకాణాలకు 70 దరఖాస్తులు వచ్చాయి.

జాతీయ పోటీలకు ఈశ్వర్ ఎంపిక



చిలక ఈశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన చిలక ఈశ్వరరావు సత్తాచాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. చిలకపాలేనికి చెందిన చిలక గాంధీ, తులసి ఈశ్వరరావు తల్లిదండ్రులు. తండ్రి వ్యవసాయం చేస్తుండగా, తల్లి గృహిణి. యువ క్రీడాకారుడు శ్రీకాకుళంలోని హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈశ్వరరావు రాణింపు పట్ల హెచ్‌పీఎస్ డిగ్రీ కళాశాల ప్రతినిధి హనుమంతు పోలినాయుడు, ప్రిన్సిపాల్ తమ్మినేని రామారావు, కొత్తకోట రవీంద్ర, అథ్లెటిక్స్ సంఘ జిల్లా ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

జాబ్‌మేళాలో 68 మంది ఎంపిక

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన వచ్చింది. 207 మంది పాల్గొనగా ఇందులో 68 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయి కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 8 నియోజకవర్గాల్లో స్కిల్ హబ్స్ నిర్వహిస్తున్నామని అన్నారు.

ఇసుక టిప్పర్ లారీ పట్టివేత

పోలాకి: మండలంలోని జొన్నాం గ్రామం వద్ద వంశధార తీరంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ లారీని మంగళవారం పట్టుకున్నట్లు పోలాకి ఎస్ఐ రంజిత్ తెలిపారు. గత నెలరోజులుగా మండలంలోని పల్లిపేట, డోల, జొన్నాం, మబగాం, వనిత మండలం తదితర చోట్ల నుంచి రాత్రిపూట ఇసుక తరలిపోతుందని విమర్శలు నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. పైడితల్లి ఉత్సవాలకు పోలీసులు వెళ్తున్న నేపథ్యంలో ఈ ఇసుక తరలింపు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు పోలీసులకు కూడా సమాచారం అందినట్లు చెబుతున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

10న డీసీసీ సమావేశం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో ఈనెల 10వ తేదీన జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం జరగనుందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు హాజరుకానున్నారని, పార్టీ జిల్లా నూతన కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు జరగనుందని పేర్కొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. భారీ, మధ్య, చిన్న నీటి పారుదల ప్రాజెక్టుల వారీగా సాగునీటి సంఘాలకు వచ్చే నెల నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని, అందుకు తగ్గ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టుల పరిధి ఆధారంగా ఓటర్ల జాబితాను సవరించాలని, ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు.

డీఎస్సీ శిక్షణ ఇచ్చేందుకు..

శ్రీకాకుళం పాత బస్టాండ్: ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందించేందుకు శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహనరెడ్డి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎస్సీలు వంద మందికి, ఎస్టీలు వంద మందికి ఈ శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, 21వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో రెండు సార్లు శిక్షణ ఇచ్చే సంస్థలు అర్హులని తెలిపారు.

నిన్నే చేరుకో లేఖ..

- గతమైపోయిన ఉత్తరం
- ఒకప్పుడు తంతి తపాలా ద్వారానే సమాచారం చేరవేత
- వాట్సాప్‌లు, ఈమెయిళ్ల కాలంలో ఉత్తరాల కాలం కనుమరుగు
- నేడు తపాలా దినోత్సవం

ఆ కాగితం ఇప్పుడు గతమైపోయింది. ఆ రాత జ్ఞాపకమై మిగిలింది. ఉత్తరమన్నది రాక ఇంటిలోని రాగి తీగ ఒంటరైపోయింది. సిరా నిండా అనుభూతులు అక్షరం అక్షరంలో అనుభవాలు దాచుకున్న లేఖ చిన్నప్పుడు తప్పిపోయి తిరిగిరాని మిత్రుడిలా గుండె గదిలో ఉండిపోయింది. ద్వాపర యుగం, త్రేతా యుగంలా ఉత్తరాల యుగమొకటి జగమంతా సాగింది. పిన్‌కోడ్‌లు గుర్తు పెట్టుకోవడం, ఇన్‌ల్యాండ్ కవర్లు కొని దాచుకోవడం, పోస్టు డబ్బా తీసే తంతును కళ్లింతలు చేసుకుంటూ చూడడం, పోస్టుమ్యాన్‌కి అన్ని అడ్రస్‌లు ఎలా తెలుసబ్బా.. అని ఆశ్చర్యపడిపోవడం.. ఒకటా రెండా ఇలాంటి గురుతులెన్నో బహుమతిగా ఇచ్చిన లేఖ చిరునామా కూడా చెప్పకుండా మాయమైపోయింది. లేఖలు మాయమైనా తపాలా సేవలు మాత్రం పురోగతి సాధించడం ఆనందదాయకం.





హిరమండలం: తోక లేని పిట్ట తుర్రున ఎగిరిపోయింది. అత్తారింటికి వెళ్లిపోయిన కూతురి క్షేమ సమాచారాన్ని ఏళ్లకు ఏళ్ల పాటు నాన్నకు తెలిపిన ఉత్తరం కనుమరుగైపోయింది. సరిహద్దులో ఉన్న సైనికుడి యోగక్షేమాలను ఆ ఇంటావిడకు ఠంచనుగా అందించిన లేఖ పత్తా లేకుండాపోయింది. ఉద్యోగం కోసం ఊరు మారిన కొడుకు రాసే 'ప్రియమైన అమ్మకు' అనే పదాన్ని విని మురిసిపోయిన తల్లులకు ఒక్క మాటైనా చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. డిజిటల్ యుగం వచ్చాక, ఈమెయిళ్లు, వాట్సాప్ చాట్‌లు ఆరంభయ్యాక ఉత్తరాలు రాయడం తగ్గిపోయింది.

స్మార్ట్‌ఫోన్ ప్రభావంతోనే

ఉత్తరాలు రాసుకునే రోజుల్లో ప్రేమలేఖలు, శ్రీవారికి ప్రేమలేఖలు అంటూ సినిమాలే వచ్చాయి. ఇప్పుడు ఏకంగా వీడియో కాల్ సదుపాయం అందుబాటులోకి రావడం, ఇలా టైప్ చేస్తే అలా అవతలి వైపు వారు చూసుకునే వెసులుబాటు రావడంతో లేఖ రాసే తీరిక ఎవరికీ లేకుండాపోయింది. దీంతో యువత అరకొర సందేశాలు పంపుకుని సంతోష పడుతున్నారే కానీ పాతకాలంలో లాగా పూర్తి సమాచారాన్ని చదువుకుని తృప్తిపడలేకపోతున్నారు.

సేవలెన్నో..

ఉత్తరాలు మాయమయ్యాయి గానీ పోస్టాఫీస్ మాత్రం చాలా సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి రోజూ రిజిస్టర్, క్యాష్ ఆన్ డిలవరీ, స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్టులు, పార్సిళ్లు, వాల్యూమ్ టేబుల్ పోస్టు, వాల్యూమ్ టేబుల్ లెటర్లు, ఏటీఎం కార్డులు, కోర్టునోటీసులు ఇలా సేవలు అందుబాటులో ఉన్నాయి. వీటిని పోస్టుమెన్‌లు చిరునామాల ప్రకారం ఇంటికి అందజేస్తారు. పూర్తిస్థాయిలో ఇన్‌ల్యాండ్ లెటర్లు కూడా సెల్‌ఫోన్ రావడంతో తగ్గుముఖం పట్టాయి. బిజినెస్ లెటర్లు ఆర్డీనరీ లెటర్లు మాత్రమే పోస్టాఫీసు ద్వారా కార్యాలయాలకు ఇళ్లకు అందుతున్నాయి.

ఉత్తరాలు లేవిప్పుడు



ఉత్తరాలు కనుమరుగవుతున్నాయి. పోస్టుమాన్ కోసం ఎదురుచూసే రోజులు లేవు. ఉత్తరాలు రాసేటప్పుడు వాటిలో ఎలాంటి తప్పులు దొర్లాయి అనే విషయాన్ని చదువుకున్నవారు గుర్తించేవారు. తెలిసిన వారు ఇలా రాయకూడదు ఇలా రాయాలి అని చెప్పేవారు. దీంతో తప్పులు సరిదిద్దుకునే అవకాశం ఉండేది. నేడు రాసే పనే లేకుండా పోయింది. ఇదంతా స్మార్ట్‌ఫోన్‌ల మహిమే.

– ఎం.చిరంజీవులనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు, తంప గ్రామం, హిరమండలం

ఉత్తరం ఒక సాధనం



గతంలో ఉత్తరాలు రాసుకుని అందులోని సమాచారం మననం చేసుకుంటూ మరో ఉత్తరం వచ్చేవరకు ఎదురుచూడటం ఎంతో చక్కగా ఉండేది. నేడు స్మార్ట్‌ఫోన్‌ల ప్రభావంతో సమాచారం సాధనంగా వినియోగించే ఉత్తరం కనుమరుగైపోయింది.

– బెహర భాస్కరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, హిరమండలం



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట గ్రామ సమీప జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పలాస నుంచి శ్రీకాకుళం వైపు జీడిపప్పు బస్తాలు తీసుకెళ్తున్న కారు.. టెక్కలి సమీప లచ్చన్నపేట గ్రామ జాతీయ రహదారి మలుపు వద్ద తమ ముందు వెళ్తున్న లారీ సడెన్‌గా బ్రేక్ వేయడంతో దాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న డ్రైవర్ పేకేటి శ్రీనివాసరావుకి తీవ్రగాయాలు కాగా కృష్ణ అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. వీరిద్దరినీ టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టెక్కలి పోలీసులు వివరాలు నమోదు చేసుకుని కేసున మోదు చేయనున్నట్లు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

రెండు వర్గాల కొట్లాట: ఒకరు మృతి



వీరాస్వామి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పోలాకి: మండలంలోని బొద్దాం పంచాయితీ వనవిష్ణుపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన రెండు వర్గాల కొట్లాటలో పాలిన వీరాస్వామి(47) అనే వ్యక్తి మృతి చెందగా మరికొందరికి గాయాలయ్యాయి. గ్రామంలో అమ్మవారి కొమ్మలు పండగ నేపథ్యంలో ఆలయానికి వెళ్లే క్రమంలో గొడవ మొదలై.. ఆఖరికి ఒకరి ప్రాణాలు పోయాయి. మృతిచెందిన వీరాస్వామి వర్గాన్ని నిలువరించేందుకు దాదాపు రెండు గంటల పాటు పోలీసులు తీవ్రంగా కష్టపడాల్సి వచ్చింది. ప్రత్యేక బలగాలు వస్తే గానీ అక్కడ పరిస్థితి సద్దుమణగలేదు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పాలిన కృష్ణమూర్తి సహా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ మహేశ్వర రెడ్డి నరసన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించి, క్షతగాత్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దాదాపు 50మంది సిబ్బందితో గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు.

విద్యుత్ షాక్‌తో భవానీ దీక్షాధారి మృతి



మణికంఠ

కంచిలి: భవానీ దీక్షలో ఉన్న కోన మణికంఠ(18) అనే యువకుడు ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. ఈ సంఘటన కంచిలి మండలంలో మఠంసరియాపల్లి పంచాయతీ పరిధి నారాయణబట్టి గ్రామంలో మంగళవారం చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసులు చెప్పిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మణికంఠ భవానీ దీక్షలో ఉన్నారు. మంగళవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో పప్పు కడిగిన నీరు బయటకు తీసుకెళుతుండగా వీధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తలపైన బకెట్‌కు తగిలింది. వైరును చేతిలో పైకి లేపి పక్కకు తీసేందుకు ప్రయత్నించగా.. అక్కడే ఆ వైరుకు చీలిక ఉండడంతో షాక్ కొట్టింది. షాక్‌కు గురైన మణికంఠను వెంటనే స్థానికులు సోంపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని తండ్రి చిరంజీవి, తల్లి చిన్నారితోపాటు ఒక చెల్లెలు ఉంది. యువకుడు బారువ ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతుడి తండ్రి చిరంజీవి మంగోలియాలో పనిచేస్తుంటారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. మణికంఠ మృతితో తోటి దీక్షాధారులు దీక్ష విరమించారు.

బైక్ నుంచి జారిపడి వృద్ధురాలి మృతి

నందిగాం: నందిగాం పంచాయతీ కొండపేటకు చెందిన కుందంగి సంజీవమ్మ(73) బైక్‌పై నుంచి జారి పడి మృతి చెందారు. గ్రామస్తులు, నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవమ్మ సోమవారం ఉదయం కిరాణా సామాన్లు కొనేందుకు నందిగాం వచ్చారు. తిరిగి గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా తన గ్రామానికే చెందిన బొడ్డు జనార్ధన ద్విచక్రవాహనంతో రావడంతో బైక్ ఆపి ఎక్కారు. బండి మణిగాం జంక్షన్ వద్దకు వచ్చే సరికి అదుపు తప్పడంతో ఆమె కిందకు పడిపోయారు. తలకు గాయం కావడంతో గ్రామస్తులు టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతురాలి కుమారుడు చిన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ డిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5.310 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఒడిశా నుంచి కేరళకి అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టణ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు స్థానిక సీఐ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఒడిశాలోని గజపతి జిల్లా, కుటునింగ గ్రామానికి చెందిన గోపాల్‌సింగ్ ఒడిశాలోని కందమాల్ జిల్లా పడంగి గ్రామంలో సంజీబ్ అనే వ్యక్తి వద్ద 5.310 కేజీల గంజాయి కొనుగోలు చేశాడని, అనంతరం ఈ గంజాయిని కేరళలోని ఎర్నాకులంలో నివాసముంటున్న మీహీర్ అనే వ్యక్తికి అందజేసేందుకు బరంపురం నుంచి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కి వచ్చి అక్కడి నుంచి రైలు మార్గం గుండా కేరళ వెళ్లేందుకు సిద్ధమయ్యాడని తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో పట్టణ పోలీసులు తనిఖీలు చేయగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి గంజాయి, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా జరుగకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్న స్థానిక పోలీస్ సిబ్బందిని ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి అభినందించారు.

కాశీబుగ్గలో..

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం రాత్రి ఇద్దరు యువకులు ఐదు కేజీల గంజాయితో పట్టుబడ్డారు. ఒడిశాకు చెందిన సాగర్ మాలిక్, దండువ కోహిర్‌లు బరంపురం నుంచి బస్‌లో పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకుని అక్కడి నుంచి రైలులో బెంగళూరుకు వెళ్తుండగా పోలీసులకు దొరికిపోయారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సంజీవరావు తెలిపారు.

ఇసుక లోడింగ్‌కు టెండర్ల ఆహ్వానం

అరసవల్లి: జిల్లాలో మొత్తం ఆరు రీచ్‌ల వద్ద ఇసుకను మనుషులతో తవ్వకాలు చేసి నిల్వ కేంద్రానికి తరలించి, వినియోగదారుల వాహనాలకు లోడ్ చేసేందుకు గాను టెండర్లు ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఛైర్మన్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ప్రకటనలో తెలియజేశారు. జిల్లా భూగర్భ గనుల శాఖ కార్యాలయం (కిమ్స్ ఆస్పత్రి వెనుక రోడ్డు)లో ఈ నెల 11న ఉదయం 11 గంటల్లోగా సీల్డు టెండర్ల బిడ్ డాక్యుమెంట్లను స్వీకరించనున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. అలాగే ఇప్పటి వరకు జిల్లాలో బూరవల్లి (గార) అంబల్లవలస (గార), బట్టేరు (శ్రీకాకుళం), హయాతినగరం (శ్రీకాకుళం), గోపాలపెంట (నరసన్నపేట), నివగాం (కొత్తూరు) రీచ్‌లను ప్రస్తుతానికి గుర్తించామని, వీటి వద్దనే ఇసుక తవ్వకాల హక్కునకు టెండర్లను ఖరారు చేయనున్నట్లు తెలిపారు.

అరగంటలో తేల్చేశారు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధి, పంచాయతీ పాలక వర్గం విధులు, బాధ్యతలపై ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం చతికిలపడింది. శిక్షణ కార్యక్రమానికి ముచ్చటగా ముగ్గురు కూడా రాని పరిస్థితి ఇచ్ఛాపురం మండలంలో నెలకొంది. శిబిరాన్ని నిర్వహించాల్సిన ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండడంతో ఉప సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు సమాచారం అందించడంలో విఫలమయ్యారు. శిబిరానికి డీపీఆర్సీ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ ఎస్.నాగరాజు వచ్చినప్పటికీ ఒక్క సభ్యుడు హాజరు కాలేదు. పదకొండున్నర గంటల సమయంలో పంచాయతీ కార్యదర్శి నీలాపు శ్రీనివాసరావు వార్డు సభ్యురాలు మూలి బెహరాను తీసుకు వచ్చి ఫొటో దిగి మమ అనిపించి అరగంటలో కార్యక్రమం తేల్చేశారు.

సాగునీరివ్వండి మహాప్రభో

జి.సిగడాం: సంతవురిటి గ్రామంలోని వరి పంట నమోదు తనిఖీని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. పంట నమోదు చేసిన వెంటనే రైతు పేరు, విస్తర్ణం, సర్వే నంబర్లతోపాటు మొబైల్ నంబర్‌కు ఓటీపీపై వచ్చిన ఎరువుల పంపిణీపై రికార్డులు పరిశీలించారు.

ఈ సందర్భంగా తమ గ్రామాలకు మడ్డువలస కుడి కాలువ నీరివ్వాలని సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, ఉప సర్పంచ్ చందనాల గణపతి, రైతులు లోకేష్, చంద్రరావు, శ్యామలరావు, రమణ నారాయణరావులు ఆయనను కోరారు. ఏటా ఇదే దుస్థితి నెలకొంటోందని, ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. దీంతో జేసీ స్పందించి రైతులకు సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మడ్డువలస సాగునీరు అందించాలని జాయింట్ కలెక్టర్ వద్ద మొరపెట్టుకుంటున్న సంతవురిటి గ్రామస్తులు

గ్యాస్ పేలుడు.. తప్పిన ప్రమాదం

పాతపట్నం: మండలంలోని హరిజన గోపాలపురం గ్రామంలో మంగళవారం ఉదయం గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాదం తప్పింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం హరిజన గోపాలపురానికి చెందిన బత్తుల తాతయ్య భార్య మహాలక్ష్మి మంగళవారం ఉదయం పది గంటల సమయంలో రేకువంట ఇంటిలో వండుతుండగా పెద్ద మంటలు వచ్చాయి. దీంతో ఆమె సిలిండర్‌ను తోసేసి ఇంటి లోపలకు వెళ్లిపోయారు. అనంతరం గ్యాస్ సిలిండర్ పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో మహాలక్ష్మి భర్త తాతయ్య, కుమారుడు లోకేష్, కోడలు జగదీశ్వరిలు ఉన్నప్పటికి ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఆర్ఐ పి.బాబ్జి, ఇన్‌చార్జి వీర్వో శ్రావణిలు సంఘట స్థలానికి వెళ్లి వివరాలు నమోదు చేసి, తహసీల్దార్‌కు విషయం తెలియజేశారు.

సీజీఎం రాకలో రహస్యమేల..?

శ్రీకాకుళం క్రైమ్ : స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పటేల్ మంగళవారం జిల్లాలో రీజనల్ కార్యాలయాన్ని, రామలక్ష్మణ బ్రాంచి కార్యాలయాన్ని రహస్యంగా సందర్శించారు. సీజీఎం స్థాయి అధికారి జిల్లాకు వస్తున్నారంటే జిల్లా క్యాడర్‌కు వారం రోజుల ముందుగానే ఓ సమాచారం వస్తుంది. మరి కొత్తగా వచ్చిన సీజీఎం జిల్లాకు వచ్చేటప్పుడు ఆయన దిగువ క్యాడర్ అధికారులైన డీజీఎం, ఇతర అధికారులెవరినీ వెంటబెట్టుకురాకుండా ఒంటరిగా, రహస్యంగా రావడం చర్చకు దారి తీసింది. గార ఎస్బీఐ బంగారం మాయం కేసుకు సంబంధించి ప్రధానంగా ఆడిట్‌లో లోపాలున్నట్లు పోలీసుల విచారణలో బయటకు రావడం, మొదటి నుంచి జిల్లా బ్యాంకు ప్రతినిధులు ఆ ఉదంతం సమయంలో ఇచ్చిన నివేదికలు కరెక్టా కాదా అని తెలుసుకోవడానికే వచ్చారని సమాచారం.

స్థల వివాదంపై ఇరువర్గాల కొట్లాట

రణస్థలం: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో స్థల వివాదంపై రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగిందని జేఆర్‌పురం పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కృష్ణాపురం రెవెన్యూ గ్రామంలో గొర్లె సూరమ్మకు 0.53 సెంట్ల డీపట్టా భూమి ప్రభుత్వ భూ రికార్డులో నమోదై ఉంది. అయితే అదే గ్రామానికి చెందిన మరో వర్గం ఆ భూమిని వేరే అవసరాలకు వాడాలని, డీ పట్టా రద్దు చేయాలని పలుమార్లు రెవెన్యూ, కలెక్టరేట్లలో ఫిర్యాదు చేశారు. సోమవారం గొర్లె సత్యం ఆ స్థలంలో గత కొన్నేళ్లుగా సాగులో ఉన్న నీలగిరి మొక్కలు తీసి కొబ్బరి మొక్కలు వేశారు. అయితే సోమవారం రాత్రికి రాత్రి ఆ కొబ్బరి మొక్కలు ఏవరో తీసేశారు. దీంతో మంగళవారం ఉదయం రెండు వర్గాల మధ్య గొడవ మొదలైంది. రెండు వర్గాల వారు దెబ్బలు తగిలాయని పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు.